అండర్-19 పోటీల్లో 'పురం' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-హిందూపురం

కడప జిల్లా రాజంపేటలో మంగళ, బుధవారం జరిగిన అండర్-19 స్కూల్ గేమ్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ కరాటే సెలక్షన్స్ పోటీల్లో హిందూపురం విద్యార్థులు తమ సత్తా చాటినట్లు కరాటే మాస్టర్ ఫైరోజ్ తెలిపారు. ఈ సెలక్షన్‌లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో కరాటే మాస్టర్ ఫైరోజ్ వద్ద శిక్షణ పొందిన రియాజ్, లోకేష్, ద్వితీయ స్థానాలను, హరీష్ తృతీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కరాటే మాస్టర్లు అభినందించారు.

ప్రతిభా విద్యార్థులతో కరాటే మాస్టర్లు

దసరాకి పందెం రాయుళ్లు..!

- జెసి, పెద్దారెడ్డి మధ్య పోటాపోటీ
- తాడిపత్రిలో మళ్లీ ఉత్కంఠ
- పట్టణవాసుల్లో ఆందోళన

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

దసరా పండుగకు తాడిపత్రిలో పందెంరాయుళ్లు దిగేందుకు సిద్ధమవుతున్నారు. మాజీ ఎమ్మెల్యేలు జెసి.ప్రభాకర్‌రెడ్డి గురువారం తాడిపత్రికి వస్తుండగా, తననూ పండుగకు తాడిపత్రిలోకి అనుమతించాలని వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా ప్రయత్నిస్తున్నారు. దీంతో మళ్లీ ఏమి జరుగుతుందోనన్న గుబులు తాడిపత్రి ప్రజల్లో నెలకొంది. ఈ ఇద్దరి మధ్య వైరం ఈనాటిది కాదు. అనేక ఏళ్లుగా నడుస్తూ వస్తున్న విషయం తెలిసిందే. గడిచిన ఐదేళ్లు టిడిపి మాజీ ఎమ్మెల్యే జెసి.ప్రభాకర్‌రెడ్డిపై అనేక రకాలైన కేసులు నమోదు చేయడం జైలుకు పంపడం జరిగింది. అంతేకాకుండా పెద్దారెడ్డి ఏకంగా ఆయన నివాసంలోకెళ్లి రావడం కూడా అప్పట్లో పెద్ద చర్చనీయాంశమైంది. అనంతరం సార్వత్రిక ఎన్నికల్లో రెండు వైపులా పరస్పర దాడులతో తాడిపత్రి పట్టణం రణరంగాన్నే తలపించింది. బాంబుల దాడులు కాకుండా వినూత్నంగా తారాజువ్వలను ఒకరిపై ఒకరు వదులుకుని దాడులు చేసుకున్నారు. ఈ దాడులను అరికట్టలేకపోయారని జిల్లా ఎస్పీతోపాటు, డీఎస్పీ, సిఐ, ఎస్ఐలపై ఎన్నికల సంఘం వేటు వేసింది. ఈ ఎన్నికల ఫలితాల అనంతరం కూడా దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. కేతిరెడ్డి పెద్దారెడ్డిని తాడిపత్రి పట్టణంలోకి రానివ్వకుండా నిలువరించేందుకు అధికార టిడిపి నాయకులు ప్రయత్నిస్తున్నారు. ఆయన తాడిపత్రి పట్టణంలోకి వచ్చారని తెలుస్తూనే దాడులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో పెద్దారెడ్డి బయటే ఉంటున్నారు. ఇక జెసి.ప్రభాకర్‌రెడ్డి కూడా అనారోగ్య కారణాలతో గత కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటూ చికిత్సపొందుతూ వచ్చారు. ఇద్దరు తాడిపత్రి పట్టణంలో లేకపోవడంతో ప్రశాంత వాతావరణే ఉంటూ వచ్చింది. ఇప్పుడు ఆరోగ్య మెరుగుపడటంతో జెసి.ప్రభాకర్‌రెడ్డి తాడిపత్రికి గురువారం రానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన అనుయాయులు, మద్దతుదారులు పెద్దఎత్తున స్వాగత ఏర్పాట్లు చేపడుతున్నారు. ఇక ఇదే సమయంలో దసరా పండుగకు తాడిపత్రికి వెళ్లేందుకు పెద్దారెడ్డి కూడా సిద్ధమవుతుండటం గమనార్హం. ఈ మేరకు ఆయన జిల్లా ఎస్పీ జగదీశ్‌ను కలసి విజ్ఞప్తి చేసి ఉన్నారు. ఆయన కూడా ఏదో రకంగా పండుగకు తాడిపత్రికెళ్లే ఆలోచనలోనున్నట్లు తెలుస్తోంది. దసరా పండుగ పేరుతో ఇద్దరూ ఒకేసారి విచ్చేస్తే ఏమవుతుందోనన్న ఉత్కంఠత తాడిపత్రి పట్టణ ప్రజల్లో నెలకొంది. ఇద్దరు కూడా దసరా పందెంరాయుళ్లలాగా పోటీ పడుతుండటంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకునే ప్రమాదం కనిపిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే పోలీసులు ఇద్దరి మధ్య వివాదం చెలరేగకుండా ఏ రకమైన చర్యలు తీసుకుంటారన్నది చూడాల్సుంది. జెసి.ప్రభాకర్‌రెడ్డి మాత్రం పెద్దారెడ్డి బహిష్కరించాలని ఇది వరకే డిమాండ్ చేశారు. ఆయన అనుయాయుడు రవీంద్రారెడ్డిని ఏ రకంగా బహిష్కరించారో ఇప్పుడు వైసిపి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డిపైనా చర్యలు తీసుకోవాలని కోరుతుండటం గమనార్హం. అయితే పోలీసులు ఈ సమస్యను ఏ రకంగా అధిగమిస్తారన్నది చూడాల్సుంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎన్. చేతన్

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుదాం : కలెక్టర్

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లాలోని ప్రతి గ్రామాన్ని స్వచ్ఛత గ్రామంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ టిఎన్. చేతన్ పేర్కొన్నారు. సెప్టెంబర్ 13 నుంచి జరుగుతున్న స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలకు సంబంధించి బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని కప్పల బండ ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ గాంధీజీ ,లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మండలాలలో ఉత్తమ సేవలు అందించిన పంచాయతీ పారిశుధ్య కార్మికులను, ఎంపీడీవోలను, ఈవోపీఆర్డీలను అధికారులతో కలిసి ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ అందించిన స్ఫూర్తితో ప్రతి గ్రామాన్ని స్వచ్ఛతా క్రమంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు కృషి చేయాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చునన్నారు. జిల్లాలో సుమారుగా రెండు వేల మంది క్లబ్ మిత్రులకు వారి కుటుంబాలకు హెల్త్ చెకప్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజాప్రతినిధులను ఎంత గౌరవిస్తున్నామో సఫాయి మిత్రలను కూడా అంతే గౌరవించాలని చెప్పారు. జిల్లాలోని 32మండలాలకు సంబంధించిన పారిశుధ్య కార్మికులతో పాటు ముగ్గురు ఎంపీడీవోలను, ఐదుగురు పంచాయతీ సెక్రెటరీలను, కళాకారులను కలెక్టర్ చేతుల మీదుగా మెమొంటో, లతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారిణి శివకుమారి, మండల స్పెషల్ ఆఫీసర్ శుభదాస్, ఎంపీపీ రమణారెడ్డి, తహాశీల్దార్ అనుపమ, శ్రీరామి రెడ్డి ,చంద్రశేఖర్, ఎంపీడీవో అశోక్ కుమార్ రెడ్డి, సర్పంచి పెద్దన్న , కప్పల బండ ఎంపీటీసీ మధురిమ, సర్పంచులు లక్ష్మీదేవి, బాలు, ఏవో నాగరాజు, తెలుగుదేశం నాయకులు లెక్కల గోపాల్, మాజీ ఎంపీటీసీ వెంకట రామప్ప, వెంకట గారి పల్లి లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

విశాఖపట్నం ఉక్కు కర్మాగారం ప్రయివేటీకరణ ప్రకియను తక్షణమే ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం పట్టణంలోని సిఐటియు కార్యాలయం నుంచి కాలేజీ సర్కిల్ మీదుగా అంబేద్కర్ సర్కిల్ వరకూ నిరసన ర్యాలీ నిర్వహించారు. సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, కో కన్వీనర్ టి.అయూబ ఖాన్, ఎల్.ఆదినారాయణ, ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్.బాషా, పట్టణ కార్యదర్శి ఎ.మారుతి, డి.చంద్రకళ, సరస్వతి, ఎం.బాబు మాట్లాడుతూ గతంలో అనేక రకాల పోరాటాలు చేసి విశాఖ ఉక్కు పరిశ్రమను సాధించారన్నారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయివేటీకరణ చేయడానికి ప్రయ త్నాలు చేయడం దుర్మార్గమన్నారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' అని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. పరిశ్రమలో 75 లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తి చేయడానికి అవకాశం ఉన్నా కేవలం 25 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేయడానికి ప్రభుత్వాలు కుట్రలు పన్నుతున్నాయన్నారు. దీనికి తోడు కర్మాగారం నడపడానికి అవసరమైన నిధులు, ఇనుప ఖనిజం కేటాయించడం లేదని మండిపడ్డారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేట్‌పరం కాకుండా కాపాడాల్సిన బాధ్యత రాష్ట్రంలోని ప్రతి పౌరునిపై ఉందని, రాబోయే కాలంలో ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్మిక నాయకులు పోతక్క, ఫాతిమా, సరస్వతి, రషీద, మున్సిపాలిటీ కార్మిక సంఘం నాయకులు ముకుంద, లక్ష్మీ, ఓబులేసు, వెంకటరాముడు, వెంకటేష్, సూరి, ఆది, తదితరులు పాల్గొన్నారు.

నిరసన ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

జాబ్‌చార్ట్‌పై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘ వ్యాప్తంగా సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న అమ్యూనిటీ సెక్రటరీలు వారి జాబ్‌చార్ట్‌ను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు హెచ్చరించారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విశ్వనాథ్, డీఈ బాలసుబ్రమణ్యం, ఏఈ జనార్ధన్‌తో కలిసి సచివాలయాల అమ్యూనిటీ సెక్రటరీలు, ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ప్రభుత్వం సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న సెక్రటరీలకు సంబంధించి నూతన మార్గదర్శకాలను విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా అమ్యూనిటీ సెక్రటరీలు వారి సచివాలయాల పరిధిలో తాగునీటి సరఫరా, పైప్ లైన్ మరమ్మతులు, మురుగు కాలువలు, రోడ్లు, కల్వర్టులు, వీధి దీపాల నిర్వహణ, డిసిల్టేషన్ తదితర పనులన్నింటినీ చూసుకోవాలన్నారు. ప్రతి రోజు ఉదయం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల హాజరును ఆయా సచివాలయాల్లోనే సెక్రటరీలు తీసుకోవాలన్నారు. అభివృద్ధి పనులకు సంబంధించిన ఎస్టిమేషన్ సిద్ధం చేసి పురపాలక సంఘానికి పంపాలన్నారు. ఆయా వార్డుల్లో చేపడుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఎం బుక్ లో నమోదు చేయాల్సిన బాధ్యత అమ్యూనిటీ సెక్రటరీలదే అని అన్నారు. వీటితో పాటు జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి నిర్దేశించిన గడువులోగా సమాచారాన్ని కార్యాలయానికి ఇవ్వాలన్నారు. ఇందులో ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించిన శాఖ పరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఇంజనీరింగ్ సిబ్బంది, సచివాలయ అమ్యూనిటీ సెక్రటరీలు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు

నేడు 'సత్యసాయి' కార్మికుల నిరసన

బకాయి వేతనాలు ఇవ్వాలని డిమాండ్

కదిరి టౌన్ : శ్రీ సత్యసాయి గ్రామీణ తాగు నీటి సరఫరా పథకంలో పనిచేస్తున్న కార్మికులు గురువారం నిరసన వ్యక్తం చేస్తున్నట్లు చెప్పారు. బకాయి వేతనాలు ఇవ్వాలని కోరుతూ కదిరి డివిజన్ గ్రామీణ తాగునీటి సరఫరా కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్టర్ తమకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడిబండ : మండలంలోని కల్లురొప్పం గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారమైంది. గ్రామస్తుల సమస్యను పలువురు నాయకులు ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామికి, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తిల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వారు గ్రామానికి బోర్‌వెల్ పంపించి డ్రిల్ వేయించారు. బోరులో నీరు పుష్కలంగా లభ్యమయ్యాయి. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యేకు, నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'పురం' జిల్లా ఆసుపత్రిలో కోల్డ్‌వార్..!

- వైద్యుల మధ్య సమన్వయ లోపం...
- రాజీకోసం ముఖ్య నేత అంతర్గత సమావేశం
- హుటాహుటిన సూపరింటెండెంట్ మార్పు



హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్, సీనియర్ వైద్యుల నడుమ కోల్డ్‌వార్ నడుస్తోంది. సూపరింటెండెంట్ తీరును విభేదిస్తున్న సీనియర్ వైద్యులు ఏకంగా రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి తో పాటు వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు లేఖలు రాశారు. ఈ వివాదాన్ని బయటకు పొక్కకుండా చూడాలని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత సహాయకులు ఒకరు వైద్యులతో మంగళవారం రాత్రి అంతర్గత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన సూపరింటెండెంట్, సీనియర్ వైద్యుల నడుమ సఖ్యత కుదర్చుడానికి చేసిన ప్రయత్నం ఫలించలేదని తెలుస్తోంది. ఈసందర్భంగా సీనియర్ వైద్యులు సూపరింటెండెంట్ వ్యవహారంపై తమ అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆయన తీరు ఏమాత్రం సరిగా లేదని, పరిపాలన అనుభవం, అవగాహన లేని జూనియర్ వైద్యుడిని సూపరింటెండెంట్ గా ఎలా నియమించారని వారు తమ అసంతప్తిని నాయకుడి వద్ద వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సూపరింటెండెంట్ క్లినికల్ వైద్యులు కాదని, వైద్యులతో సత్సంబంధాలు కొనసాగించే లేరని, వైద్యుల పట్ల దురుసుగా వ్యవహరిస్తున్నారని సీనియర్ వైద్యులు ఈసందర్భంగా ఫిర్యాదు చేసినట్లు సమాచారం. వైద్యుల నడుమ సఖ్యత కుదర్చుడానికి చేసిన ప్రయత్నాలు ఫలించకపోవటంతో నాయకుడు వైద్యులపై ఒకింత అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. చివరకు ఈ నెల 4న బాలకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించే ఆసుపత్రి అభివృద్ధి సమావేశంలో విభాగాల వారీగా ఆయా విభాగాల్లో ఉన్న సమస్యలను తెలపాలని సూచించినట్లు సమాచారం. గైనకాలజీ విభాగంలో పని భారం పెరిగిందని, మరి కొంత మంది వైద్యులను నియమిస్తే తప్ప తాము ఇక్కడ విధులు నిర్వహించలేమని ఆ విభాగం వైద్యులు తెగేసి చెప్పినట్లు తెలిసింది. దీంతోపాటు సీటీ స్కాన్ పని చేయక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,పూర్తిస్థాయిలో రెడియాలజిస్టును నియమిస్తే అందరికి సౌలభ్యంగా ఉంటుందని వైద్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. సమస్యలన్నింటిని విన్న ఆ నాయకుడు ఎమ్మెల్యే బాలకృష్ణ ద్వారా ముఖ్యమంత్రితో చర్చించి సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నం చేస్తామని వైద్యులకు హామీ ఇస్తూ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులందరూ సమన్వయంతో పనిచేసి వచ్చే రోగులందరికీ నాణ్యమైన వైద్య సేవలను అందించాలని సూచించినట్లు సమాచారం.

హుటాహుటిన సూపరింటెండెంట్ మార్పు

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను మార్పు చేస్తూ రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు మంగళవారం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు మంగళవారం రాత్రి వైద్య విదాన పరిషత్ జిల్లా అసుపత్రుల కో ఆర్డినేటర్ ఉత్తర్వులను విడుదల చేశారు. ప్రస్తుత సూపరింటెండెంట్ వైఖరి పై సీనియర్ వైద్యులు తీవ్ర ఆరోపణలు చేస్తూ ఉన్నతాధికారులకు లేఖలు రాసిన నేపథ్యంలో ఉన్నతాధికారులు డాక్టర్ లింగన్నను సూపరింటెండెంట్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులను త్వరితగతిన అమలు చేయాలని పేర్కొన్నట్లు సీనియర్ వైద్యులు చెప్పారు.

జిల్లా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌గా లింగన్న

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా అసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ గా డాక్టర్ లింగన్న బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో సమన్వయం చేసుకుని రోగులకు నాణ్యమైన వైద్య సేవలను అందే విధంగా చూస్తామన్నారు. అదే విధంగా అసుపత్రిలో నెలకొన్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి తన వంతు ప్రయత్నం చేస్తానన్నారు.

మహా ధర్నాను జయప్రదం చేయండి : బిఎస్‌పి

ప్రజాశక్తి-హిందూపురం

బిసి కుల గణన చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9న విజయవాడలోని అలంకార్ సెంటర్ వద్ద జరిగే మహా ధర్నాను జయప్రదం చేయాలని బిఎస్‌పి రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు కోరారు. ధర్నా జయప్రదం కోరుతు బుధవారం పట్టణంలోని బిఎస్‌పి కార్యలయం వద్ద కరపత్రాలను, గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయన్నారు. వెంటనే బీసీల కుల, జన గణన నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు హరికుమార్, ఎమ్మెల్ నారాయణ, గంగప్ప, చిరంజీవి, నరసింహప్ప, మౌలాలి, చాంద్‌బాషా, బాబావలి, బాలం గంగాధర్, ఆబాద్ పేట్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

ముని్సపల్ టీచర్ల సమస్యలపై సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-కదిరి టౌన్

దీర్ఘకాలంగా అపరిష్కృతం కాని మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం యుటిఎఫ్ పట్టణ ప్రధాన కార్యదర్శి భార్గవ అధ్యక్షత స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా కోశాధికారి డి.శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి చెన్నూర్ తాహెర్‌వలి మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు అనుసరనీయమన్నారు. మనం గాంధీజీ మార్గంలో ఉద్యమం చేస్తూ మున్సిపల్ పాఠశాలల్లో భాష ఉపాధ్యాయులు, ఎస్జిటిలు, పిఇటిల పోస్టులను విద్యార్థుల నిష్పత్తి ప్రకారం అప్‌గ్రేడ్ చేసి నవంబర్‌లోగా ఉద్యోగోతులు కల్పించాలన్నారు. అర్హులైన హెచ్ఎంలను అర్బన్ ఎంఇఒలుగా నియమించాలని, ఉపాధ్యాయులకు జిపిఎఫ్ ఖాతాలు తెరిపించాలని, బదిలీలు చేపట్టాలి, జీవో 84 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో నాయకులు ఆజంబాషా, సునీల్‌కుమార్, ఆసిఫ్, కిషోర్, ఫయాజ్, ఖాజా, రవివర్ధన్‌రెడ్డి, నజీర్, సంతోష్, రమణనాయక్, రమేష్, సుబ్బయ్య, బాలాజీనాయక్, వివిధ మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్యాగ్రహ దీక్షలో పాల్గొన్న నాయకులు

జీవో 117 రద్దు చేయాలి : డిటిఎఫ్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

జీవో 117ను రద్దు చేయాలని, మాతృభాష మాధ్యమం అమలు చేయాలని కోరుతూ బుధవారం ఓబుళదేవరచెరువులో డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్(డిటిఎఫ్) ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డిటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి షర్ఫుద్దీన్, జిల్లా అధ్యక్షులు గౌస్ లాజమ్ మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేయడంతో పాటు ఆంగ్ల భాష మాధ్యమంతో పాటు మాతృభాష మాధ్యమాన్ని యథావిధిగా కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి మౌలాలి, నాగరాజు, రామకృష్ణ, ఈదుళ్ల వెంకట చలమయ్య, నజీర్, బాషా, సాకే నరేంద్ర, షబ్బీర్, వీరారెడ్డి, అతావుల్లా, సోమశేఖర్‌నాయక్, ఈశ్వర్, పాల్గొన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి

పెనుకొండలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి సవిత, అధికారులు, నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

సత్యం, అహింస అస్త్రాలుగా చేసుకొని దేశ స్వాతంత్ర్యం కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధుడు మహాత్మాగాంధీ అని కలెక్టర్ టిఎస్.చేతన్ కొనియాడారు. గాంధీ జయంతి పురస్కరించుకొని బుధవారం కలెక్టరేట్‌లో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం సాధించడంలో గాంధీ కీలకపాత్ర పోషించారన్నారు. హింసతో సాధ్యం కాదని అహింసా పద్ధతుల ద్వారానే స్వరాజ్యం సిద్ధిస్తుందని చేసి నిరూపించారన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గాంధీ కోరుకునేవారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ కొండయ్య, కలెక్టరేట్ ఏవో వెంకటనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

పెనుకొండ : పెనుకొండ పట్టణంలోని టిడిపి కార్యాలయం, గాంధీ సర్కిల్ వద్ద మంత్రి సవిత గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శాంతి కపోతాలను ఎగరవేశారు. మంత్రి మాట్లాడుతూ దేశ స్వేచ్ఛ, స్వాతంత్ర్యమే లక్ష్యంగా సత్యం, అహింస ఆయుధాలుగా పోరాడిన మహనీయుడు మహాత్మా గాంధీ అన్నారు. సమాజంలో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేవని మంత్రి కొనియాడారు. ప్రజల ఆరోగ్యం, ఆనందం మీ చేతుల్లోనే ఉందన్నారు. గాంధీ సర్కిల్, స్టేట్ బ్యాంకు పరిసర ప్రాంతాల్లో చీపురు చేత పట్టి చెత్త చెదారాన్ని మంత్రి ఊడ్చారు. అనంతరం 30 మంది కార్మికులకు బహుమతులు అందజేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో ఆనంద్‌కుమార్, డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తహశీల్దార్, ఎంపిడిఓ, నగర పంచాయతీ, ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, విద్యాసంస్థల్లో గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి నరసింహులు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వానికి, సిఎం చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, లాయర్ సుదర్శన్‌రెడ్డి, లాయర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పెనుకొండ టౌన్: యుటిఎఫ్ పెనుకొండ డివిజన్ శాఖ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్ మాట్లాడుతూ గాంధీ సిద్ధాంతాలు అనుసరనీయమని, మనమం దరం గాంధీ మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జిసి.నరేష్‌కుమార్, సీనియర్ నాయకులు నారాయణస్వామి, జి.రమేష్, ఎంకె.నబి, కృష్ణానాయక్, రవీంద్రనాథ్, హనుమంతునాయక్, రాజాగోపాల్, బిల్లే రామాంజనేయులు, కేశప్ప, రామన్న, లెక్చరర్, తదితరులు పాల్గొన్నారు. పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం వద్ద కమిషనర్ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కమిషనర్ మాట్లాడుతూ 'క్లీన్ పెనుకొండ-గ్రీన్ పెనుకొండ' నినాదాన్ని నిజం చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు, నగర పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : జాతిపిత మహాత్మగాంధీ లాంటి గొప్ప వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ వి.రత్న ప్రజలకు సూచించారు. పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గాంధీ త్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. గాంధీ గొప్ప స్ఫూర్తి ప్రదాత, దేశానికి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహనీయులు అని, ఆయనను ప్రతిఒక్కరూ స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశంలో అందరం ప్రశాంతంగా జీవిస్తున్నామంటే గాంధీ గొప్పతనమేనని వివరించారు. కార్యక్రమంలో ఎఆర్ డీఎస్పీ విజయ్ కుమార్, ఎస్‌బి సిఐ బాలసుబ్రమణ్యంరెడ్డి, ఆర్ఐ వలి, పెనుగొండ సిఐ రాఘవన్, సిసి రాఘవేంద్ర, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఎఆర్ ఎస్ఐ శ్రీరాములు, అధికారులు, ఎఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

నల్లచెరువు : మహాత్మగాంధీ టైలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముస్తఫా ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, టైలర్లు, తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్ : నియోజకవర్గ టిడిపి ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహానికి తెలుగుతమ్ముళ్లు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గాంధీ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గాంధీ పార్క్, గాంధీ సర్కిల్‌లో ఉన్న గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ చేసిన విశిష్ట చేసిన సేవలను స్మరించుకున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బాలింతలు, చిన్న పిల్లలకు బ్రెడ్, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు జయసింహా, వైస్ ప్రెసిడెంట్ నరేంద్రరెడ్డి, ప్రసన్నకుమార్, సోలిగాళ్ల వెంకటేష్, శివయ్య, రత్నశేఖర్‌రెడ్డి, డాక్టర్ వివేక్, మనోహర్‌గుప్తా, కృష్ణమూర్తి, విజయభాస్కర్, వినయ్‌కుమార్, రోటరీ బాయ్, జ్యోతి, వర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ స్వర్ణలత, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ సాయిమనోహర్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ గాంధేయ మార్గం అనుసరణీయం, ఆచరణీయం అన్నారు. అనంతరం సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ శారద, ఈఓఆర్డీ దివాకర్, రెవెన్యూ, ఎంపిడిఒ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర: ప్రతిఒక్కరూ గాంధీ అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలను కొనసాగించాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పిలుపినిచ్చారు. పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయంలో గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, జిల్లా లీగల్ సెల్ కార్యదర్శి గుండుమల రాధాకృష్ణ గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు ఉమాశంకర్, హనుమంతు, రమేష్, నాయకులు భక్తర్‌సాబ్, సుబ్బరాయుడు, నాగరాజు, కృష్ణమూర్తి, రంగేగౌడ్, పుల్లయ్య, నరేష్ కన్నా, తిమ్మరాజు, రవి, కాంతరాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలోని పెడబల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిన్నారులు గాంధీ, భగత్‌సింగ్ వేషధారణలో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్త రజియా బేగం, ఆయా షాహినాజ, గ్రామస్తులు పాల్గొన్నారు.

గ్రామ స్వరాజ్యం నిర్మిద్దాం : ఎమ్మెల్యే

కదిరి టౌన్ : మహాత్మగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం నిర్మిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఎంఎస్.పార్థసారధి, పట్టణ అధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నియోజకవర్గ జనసేనపార్టీ ఇన్‌ఛార్జి భైరవ ప్రసాద్ ఆధ్వర్యంలో పట్టణంలోని రాణిపేట స్కూల్‌లో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సహకారంలో కదిరి జనసేనపార్టీ తరుపున పట్టణంలో గాంధీ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు చలపతి, రవికుమార్, జయవర్ధన్, గవ్వల శ్రీనివాసులు, చక్కా రమణ, అంజిబాబు, నాగమణి, ప్రతాప్, సోమశేఖర్, రామచంద్ర, పులగంపల్లి రాజా, గంగరాజు, చక్రవర్ధన్‌రెడ్డి, పాల్గొన్నారు. కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాలలో ప్రిన్సిపల్ ఎంఎస్.కిరణ్ అధ్యక్షతన గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపల్ గాంధీ, లాల్ బహదూర్‌శాస్త్రి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కదిరిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

పుట్టపర్తి రూరల్ : మండలంలోని ఎనుములపల్లి గ్రామంలో రిటైర్డ్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా అలంకరించిన సైకిల్‌రిక్షాలో గాంధీ చిత్రపటాన్ని ఉంచి ఊరేగించారు. రెడ్ క్రాస్ స్వచ్ఛంద సంస్థకు చెందిన రాజా మెడికల్స్ హెల్ప్ లైన్, కె.రాజా, రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెంకటరత్నం, యువకులు జాతీయ గీతాలు ఆలపిస్తూ వీధుల్లో గాంధీ చిత్రపటాన్ని ఊరేగించారు.

కొత్తచెరువు : ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పార్థసారధి, ప్రకాష్, వెంకటనారాయణ, నాగేంద్ర, శంకర్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక మూడు రోడ్ల కూడలిలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎద్దుల రాముడు మాట్లాడుతూ గాంధీ చూపిన మార్గం స్ఫూర్తినిస్తుందని, ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో రామకృష్ణ, ప్రసాద్, రాధ, భాస్కర్‌రెడ్డి, వెంకటప్ప, యూసుఫ్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాల్లో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రెవెన్యూ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి, ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ ఆదినారాయణయాదవ్, గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచి లక్ష్మీదేవి చంద్రాయుడు, బస్టాండ్ కూడలిలో ఆర్యవైశ్య సంఘం నాయకులు గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీ సేవలను కొనియాడారు.

హిందూపురం : జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు పట్టణంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఉన్నా జాతి పిత విగ్రహానికి మున్సిపల్ వైస్ చైర్మేన్ బలరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు, ఎంఇ విశ్వనాథ్, డీఈ బాలసుబ్రమణ్యంతో పాటు మున్సిపల్ ఉద్యోగులు, పలువురు కౌన్సిలర్లు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఐదు లాంతర్ల సర్కిల్ లో ఆర్యవైశ్య సంఘం, కాంగ్రెస్, టిడిపి వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. వైసిపి ఆధ్వర్యంలో వైసిపి కార్యాలయంలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు వేణురెడ్డి తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా బాలయేసు, ఎస్‌డిజిఎస్ బాలాజి, సప్తగిరి కళాశాలల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో గాంధి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.

గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ టిఎస్.చేతన్, ఎస్పీ వి.రత్న, మడకశిరలో గుండుమల, శ్రీనివాసమూర్తి, పెనుకొండలో యుటిఎఫ్ నాయకులు

సోలార్ పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసుకోండి : డిఇఇ

ప్రజాశక్తి-హిందూపురం

అవకాశం ఉన్నా ప్రతి ఒక్కరు సోలార్ పవర్ గ్రిడ్‌ను వారి నివాస గృహాల వద్ద ఏర్పాటు చేసుకుంటే విద్యుత్ బిల్లు ఆదా చేసుకోవచ్చని డీఈఈ భూపతి అన్నారు. పట్టణంలోని సదాశివా నగర్ కాలనీకి చెందిన శిరీషారాణి, నరసింహ్మమూర్తి లు వారి నివాసంపై 3 కిలోవాట్ల సామర్థ్యం గల సన్ మిత్ర-సన్ టెక్ సోలార్ సిస్టమ్‌ను అమర్చుకున్నారు. దీనిని విద్యుత్ గ్రిడ్‌కు బుధవారం అనుసంధానం చేశారు. అనంతరం 25 సంవత్సరాల పాటు విద్యుత్ కొనుగోలు చేస్తూ ఒప్పంద పత్రాన్ని వారికి డీఈఈ భూపతి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ సబ్సిడీ పథకం ద్వారా నివాసాల వద్ద సోలార్ సిస్టంలను ఏర్పాటు చేస్తామన్నారు. వినియోగదా రులు అమర్చుకుంటే విద్యుత్ బిల్లులో దాదాపు 90శాతం వరకు ఆదా కావడానికి అవకాశం ఉందన్నారు. మరి కొంత మందికి విద్యుత్ శాఖ వారే బిల్లులు చెలించే అవకాశం ఉందన్నారు. కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ సిస్టం ఏర్పాటు చేసుకుంటే నెలకు 100 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందన్నారు. వినియోగదారులు 100 యూనిట్ లు వాడితే వారికి విద్యుత్ బిల్లు రాదన్నారు. అంతకన్నా ఎక్కువ వాడితే బిల్లు వస్తోందన్నారు. తక్కువ వాడితే విద్యుత్ శాఖ వారికి ఒప్పంద పత్రం పేర్కొన్న విధంగా బిల్లు చెల్లించడం జరుగుతుందన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యం గల సోలార్ సిస్టం ఏర్పాటుకు రూ.78వేలు ఖర్చు అవుతుందన్నారు. దీనికి కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందనివినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాయలసీమ జోన్ పిఎం సూర్య ఘర్ నోడల్ అధికారి రామకృష్ణ, ఎడిఇ నాగన్న, స్థానిక నోడల్ ఆఫీసర్ అబ్దుల్ రహీం, ఏఈలు విష్ణు, లక్ష్మీకాంత్ రెడ్డి, సల్ మిత్ర ఎమ్‌డి ఓబులేషు, ఇతర ఇంజనీర్లు, అధికారులు, సన్ మిత్ర సిబ్బంది పాల్గొన్నారు.

ఒప్పంద పత్రం అందిస్తున్న డిఈఈ భూపతి

శిథిలావస్థలో రొద్దం ఆస్పత్రి భవనం

ప్రజాశక్తి-రొద్దం

స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి భవనం శిథిలావస్థకు చేరుకుంది. గోడలు నెర్రలు చీలడంతో పాటు చిన్నపాటి వర్షం కురిసినా గదులు కారుతున్నాయి. పైకప్పు గుండా చెట్ల వేర్లు కిందిభాగంలోకి దూసు కొచ్చాయి. ఈ పరిస్థితుల్లో ఆసుపత్రి భవనం ఎప్పుడు కూలుతుందోననే భయం వైద్యులు, సిబ్బంది, రోగులను వెంటాడుతోంది. విధిలేని పరిస్థితుల్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నట్లు ఆసుపత్రి సిబ్బంది పేర్కొంటున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి భవనం కట్టి 30 ఏళ్ల కావడంతో పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ఆసుపత్రిలో నాలుగు బెడ్లు మాత్రమే ఉండడం, కనీసం కూర్చునేందుకు ఏర్పాట్లు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓపి, మందుల గదులు చిన్న పాటి వర్షానికి కారుతుండడంతో రికార్డులు, మందులు పాడయ్యే ప్రమాదం ఉందని సిబ్బంది పేర్కొం టున్నారు. ముఖ్యంగా భవనంపై చెట్లు పెరిగి వాటి వేర్లు పైకప్పు ద్వారా కిందకు దూసుకొచ్చి గోడలపై పాకాయి. దీంతో భవనం మొత్తం పూర్తిగా దెబ్బతిని శిథిలావస్థకు చేరింది. గత ప్రభుత్వంలో నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు కాగా కాంట్రాక్టర్ పునాదులు వేసినా బిల్లులు మంజూరు కాకపోవడంతో పనులన అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో ఉన్న నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రిని మరో భవనంలోకి మార్చాలి లేదా కొత్త భవన నిర్మాణం చేపట్టాలని వైద్యులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

భవనం పై భాగంలో చీలిన గోడలు

పైకప్పు ద్వారా కిందకు దూసుకొచ్చిన వేర్లు

కూర్చోవడానికి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్న వృద్ధుడు

గోడలు నెర్రెలు చీలి కారిన బెడ్లు ఉన్న గది

భవన నిర్మాణ కార్మికుల కమిటీ ఏర్పాటు

ప్రజాశక్తి-గోరంట్ల

మండలంలోని మాధవరాయ ఆలయ ఆవరణలో బుధవారం భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. మండల భవన నిర్మాణ కార్మికులతో కమిటీ ఏర్పాటుపై చర్చించారు. కమిటీ మండల కన్వీనర్‌గా కమల వాండ్లపల్లి కిరణ్ కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబ శివ మాట్లాడుతూ భవిష్యత్తులో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై మండల వ్యాప్తంగా కార్మికులను ఏకం చేసి పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక సంక్షేమం బోర్డును పునరుద్ధరించాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు విరివిగా ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న నిర్మాణ కార్మికుల క్లైములు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 4వ తేదీ తహశీల్దార్ కార్యాలయం వద్ద జరిగే ధర్నాలో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, సభ్యులు స్వర్ణలత, నాగరాజు, శ్రీనివాసులు, సురేష, రామంజి, లోకేష్ పాల్గొన్నారు.

కొత్తగా ఏర్పాటైన భవన నిర్మాణ కార్మికుల కార్యవర్గం

'దసరా'కు అదనంగా వంద బస్సు సర్వీసులు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

దసరా పండగ పురస్కరించుకొని ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వివిధ ప్రాంతాలకు వంద బస్సులు అదనంగా నడపుతున్నట్లు డిపిటిఒ టి.మధుసూదన్ తెలిపారు. జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన డిపో మేనేజర్లు, ట్రాఫిక్, గ్యారేజ్ సూపర్వైజర్లతో సమీక్షించారు. ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకూ హైదరాబాద్‌కు 30, బెంగళూరు నుంచి 20, తిరుపతి నుంచి 10, చెన్నై నుంచి 5, విజయవాడ నుంచి 5 సర్వీసులతో పాటు అనంతపురం-పుట్టపర్తి నుంచి 30 లోకల్ బస్సులు నడుపుతామన్నారు. తిరుగు ప్రయాణానికి కూడా 13 నుంచి 16వ తేదీ వరకు సర్వీసులు నడుపుతామన్నారు. దూర ప్రాంతాల ప్రయాణికులు ఆన్ లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు అన్నారు.

పేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

మడకశిర : మండల కేంద్రమైన అగళికి చెందిన నళినికి బుక్కరాయసముద్రం మండలంలోని సెంట్రల్ జైలు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో పీజీలో సీటు వచ్చింది. ఆమెకు బుధవారం ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనంతపురం నగరంలోని ఆర్అండ్‌బి విశ్రాంతి భవనంలో రూ. 15వేలు అందజేశారు.

పేద విద్యార్థినులకు చేయూత

మహాత్మగాంధీ జయంతి సందర్భంగా బుధవారం మండలంలోని బుల్లసముద్రం ఉన్నత పాఠశాల హెచ్ఎం విశ్వనాథ్ ఆధ్వర్యంలో కొందరు ఉపాధ్యాయులు పట్టణంలో ఇంటర్ చదువుతున్న నలుగురు విద్యార్థినులకు ఆర్థికసాయం అందజేశారు. ఛత్రం గ్రామానికి చెందిన శ్యాలిని(శ్రీవెంకటేశ్వర జూనియర్ కాలేజీ)కి రూ. 15వేలు, భవిత(పెద్దపల్లి) రూ. 7వేలు, సాయిస్వర్ణలత(బుల్లసముద్రం) రూ. 7వేలు, నయనశ్రీ(మడకశిర) రూ. 7వేలు అందజేశారు.

విద్యార్థిని నళినికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే రాజు

క్రీడలతో మానసికోల్లాసం : ఎస్ఐ

ప్రజాశక్తి-సోమందేపల్లి

యువత సెల్‌ఫోన్‌కు బానిస కాకుండా క్రీడల్లో పాల్గొని మానసిక ఉత్సాహం, శారీరక దృఢత్వం పెంపొందించుకోవాలని ఎస్ఐ రమేష్‌బాబు, టిడిపి పార్లమెంట్ కార్యదర్శి నీరుగంటి చంద్రశేఖర్ సూచించారు. సోమందేపల్లిలో బుధవారం జనసేనపార్టీ మండల కన్వీనర్ జబీవుల్లా ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించగా ఎస్ఐ రమేష్‌బాబు, నీరుగంటి చంద్రశేఖర్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు, ఓటమి సహజమన్నారు. ఎవరు గెలిచినా, ఎవరు ఓడినా క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని, కక్షలు గొడవలకు దూరంగా ఉంటూ ప్రశాంత వాతావరణంలో పోటీల్లో పాల్గొనాలన్నారు. అనంతరం సాయినగర్, చెన్నాపురం జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో జబీవుల్లా, స్థల యజమాని సోమప్ప కుమారుడు దేవా, అనిల్, షారుక్, చెన్నాపురం అంజి, కొత్తపల్లి శ్రీనివాసులు, అఖిల్, బాలు, బాబా, సుధీర్‌రెడ్డి, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం

కెవిపిఎస్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-సోమందేపల్లి

స్థానిక అంబేద్కర్ కాలనీలో బుధవారం కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు హనుమయ్య, మండల కార్యదర్శి వెంకటేష్ ఆధ్వర్యంలో కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హనుమ య్య మాట్లాడుతూ దళితుల సామాజిక, ఆర్థిక, సమానత్వ సాధనకై 1998 అక్టోబర్ 2వ తేదీ కెవిపిఎస్ ఏర్పడిందన్నారు. దళితులపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు అరికట్టాలని, దళిత, గిరిజనుల ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగోన్నతులు, ప్రయివేటు రంగాల్లో రిజర్వేషన్లు, జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు అమలుపై పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల నాయ కులు రామాంజనేయులు, బాబు, కె.రవి, ఎస్.ఆనంద్, ఆనందప్ప, పూజారి నర్సింహులు, వెంకట రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శివాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు

ప్రజాశక్తి-బత్తలపల్లి

స్థానిక శ్రీలలిత త్రిపుర సుందరీ సమేత ఓంకారేశ్వరుని ఆలయంలో గురువారం నుంచి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కేశవస్వామి తెలిపారు. ఆయన బుధవారం శివాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు ఆధ్వర్యంలో ప్రతి రోజూ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అందులో భాగంగా గురువారం అమ్మవారికి బాలాత్రిపుర సుందరీ దేవి అలంకరణ, 4వ తేదీ గాయత్రీదేవి, 5న అన్నపూర్ణాదేవి, 6న శ్రీలలితా త్రిపుర సుందరీదేవి, 7న మహాచండిదేవి, 8న మహాలక్ష్మీదేవి, 9న సరస్వతిదేవి(మూలానక్షత్రం), 10న దుర్గాదేవి(దుర్గాష్టమి), 11న మహిషాసురమర్దిని, 12న దసరా పండుగ రోజున రాజరాజేశ్వరీదేవి అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు వడిబియ్యం, ఒక రోజు పూజకు అయ్యే ఖర్చును విరాళంగా ఇవ్వవచ్చన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలకు డిమాండ్

ప్రజాశక్తి-కదిరి టౌన్

సెలవు రోజుల్లో తరగతులు నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయల సీమ విద్యార్థి యువజన సంఘం(ఆర్ఎస్‌వైఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 3 నుంచి అక్టోబర్ 13వ తేదీ వరకు దసరా సెలవులు ప్రకటించిందని, ఈ సెలవు దినాల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై విద్యా శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని, లేనిచో ఆయా పాఠశాలల ఎదుట పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ అధ్యక్షులు రాజేష్, నూర్, రామాంజి, పవన్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

గ్రామసభలు ప్రారంభం

ప్రజాశక్తి-రొద్దం

మండల వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో గ్రామసభలు ప్రారంభం అయ్యాయి. ఇందులో భాగంగా బుధవారం రెడ్డిపల్లి సచివాలయంలో గ్రామ సభ నిర్వహించారు. ఇందులో పంచాయతీ కార్యదర్శి రెహమాన్, సర్పంచి రామంజి, పెనుకొండ మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ మణి, మాజీ డీలర్, గ్రామస్తులు పాల్గొన్నారు. గత గ్రామసభలో జరిగిన సమావేశంపై చర్చించి, అనంతరం 2024-25వ సంవత్సరంలో జరిగే పనులపై చర్చించారు.

ఎంజెపి కళాశాల ప్రిన్సిపల్‌కు రాష్ట్ర ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-గుడిబండ

స్థానిక ఎంజెపి కళాశాల ప్రిన్సిపల్ జ్యోతికి విఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉత్తమ ప్రిన్సిపల్ అవార్డు ప్రదానం చేశారు. ఈ మేరకు విజయవాడలోని కమ్యూనిస్టు భవనంలో జరిగిన సమావేశంలో జ్యోతి ఎమ్మెల్సీ లక్ష్మణరావు నుంచి అవార్డు అందుకున్నారు. ఆమెకు అవార్డు రావడం పట్ల అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

అవార్డు గ్రహీత ప్రిన్సిపల్ జ్యోతిని సన్మానిస్తున్న విఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి-లేపాక్షి

ఈ నెల 1వ తేదీ అనంతపురంలో జరిగిన అండర్-17 వాలీబాల్ పోటీల్లో స్థానిక ఓరియంటల్ హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న బేబీ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే గత నెల 28, 29, 30 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఫుట్‌బాల్ పోటీల్లో అనంతపురం జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అందులో స్థానిక ఓరియంటల్ పాఠశాల విద్యార్థిని పూజిత జట్టులో గోల్ కీపర్‌గా ఉండి జట్టు విజయానికి దోహదపడింది. వీరిని హెచ్ఎం వివిసి గిరి, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

రాయితీపై ఉలవలు పంపిణీ

అగళి : మండలంలోని 13 పంచాయతీల్లో బుధవారం రైతులకు 80 శాతం రాయితీపై ఉలవలు పంపిణీ చేసినట్లు ఏవో నాయక్ తెలిపారు. ఒక్కో రైతుకు 10 కిలోల చొప్పున జడ్పిటిసి ఉమేష్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


రికార్డులు పరిశీలిస్తున్న డాక్టర్ పద్మజ

అనధికార ప్రయోగశాలలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

రిజిస్ట్రేషన్ చేసుకోని నర్సింగ్‌హోంలు, క్లినిక్ లు, ప్రయోగశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వైద్యాధికారిణి పద్మజ హెచ్చరించారు. ఈ మేరకు ఆమె బుధవారం హిందూపురం పట్టణంలోని పలు ల్యాబ్‌లను తనిఖీ చేశారు. సత్యంచ డయాగ్నస్టిక్స్‌లను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. అనుమతుల లోపం ఉన్న ప్రయోగశాలకు షోకాజ్ నోటీసు జారీ చేశారు. అదే విధంగా పలు నర్సింగ్ హోంలను తనిఖీ చేసిన ఆమె పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో టీం సభ్యులు ముస్తఫా, రమేష్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికులు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కమిషనర్ ప్రహ్లాద తెలిపారు. గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం మున్సిపల్ కార్యాలయం ముందు గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు ఆరోగ్యంగా ఉండటానికి పారిశుధ్య కార్మికుల సేవలే కారణమన్నారు. ప్రతిఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు. అనంతరం పారిశుధ్య కార్మికులను పూలమాలలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఛైర్మన్ ఓబుళపతి, టిడిపి ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, నాయకులు కడియాల సుధాకర్, బెస్త చలపతి, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

నల్లమాడ : మండలంలోని దొన్నికోట గ్రామపంచాయతీలో సర్పంచి రాగినేని సరస్వతి నాగరాజు అధ్యక్షతన పారిశుధ్య కార్మికులను సన్మానించారు. విద్యార్థుల్లో శ్రమదానం అలవాటు చేయాలని సూచించారు. 'స్వచ్ఛ భారత్' అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలు ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డి అమర్నాథ్‌రెడ్డి, స్వచ్ఛ భారత్ ఎంఆర్పీ గంగాధర్, గ్రామపంచాయతీ కార్యదర్శి రామ్మోహన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మడకశిర : మండలంలోని కల్లుమర్రి సచివాలయంలో ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రీన్ అంబాసిడర్లను సన్మానించారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ కృష్ణనాయక్, సర్పంచి నాగరాజు, సెక్రటరీ రాజు, ఉపాధి హామీ సిబ్బంది, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని మాగేచెరువు పంచాయతీ గ్రామమైన రంగేపల్లిలో బుధవారం సర్పంచి నరసింహులు ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా సచివాలయ సిబ్బందితో కలిసి గ్రామంలోని వీధులను ఊడ్చి శుభ్రం చేశారు. వారు మాట్లాడుతూ

పారిశుధ్య కార్మికులను సన్మానించిన కలెక్టర్ టిఎస్.చేతన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, నీరు నిల్వ లేకుండా చూసుకోవడం ద్వారా ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కృష్ణప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్ రామాంజినేయులు, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది, అంగన్వాడీ వర్కర్స్, యానిమేటర్స్, వార్డ్ మెంబర్ శ్రీనివాసులు, అంజనప్ప, కిష్టప్ప, నరసింహమూర్తి, అక్కులప్ప, సత్యనారాయణ, సుబ్బరాయుడు, కోనప్ప, ఆంజనేయులు, చిన్న నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

తలుపుల : స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ఉద్యమంలా చేపట్టి గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలని ఎంపిడిఒ కిరణ్‌మోహన్‌రావు సూచించారు. ముందుగా సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు ప్రధాన రహదారి మీదుగా ర్యాలీగా వెళ్లి మూడు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. స్వచ్ఛత హి సేవ కార్యక్రమం ప్రాముఖ్యత, పరిసరాల పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచి శ్రీలత, ఈవోఆర్డీ శకుంతల, టోపీ రమణ, సచివాలయ, పంచాయతీ సిబ్బంది అంగన్వాడీ కార్యకర్తలు, పారిశుధ్య కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి రూరల్ : 'పరిశుభ్రత వైపు ఓ అడుగు' కార్యక్రమంలో భాగంగా మాజీ సైనికోద్యోగి మహానంద ఆధ్వర్యంలో మండలంలోని పెడపల్లి ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రాంగణాలను శుభ్రం చేశారు. అలాగే లాల్‌బహుదూర్‌శాస్త్రి, మహాత్మగాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బిజెపి గ్రామీణ మండల కన్వీనర్ భాస్కర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ ముద్దుల మహానంద, డాక్టర్ రాఘవేంద్ర, బిజెవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు హరికృష్ణ, నాయకులు శివానంద, మురళినాయక్, డాక్టర్ విక్రమ్ పాల్గొన్నారు.

పెనుకొండలో పారిశుధ్య కార్మికులతో కలిసి రోడ్లు శుభ్రం చేస్తున్న మంత్రి సవిత

ధర్మవరం రూరల్ : మండలంలోని కప్పలబండ పంచాయతీలో సర్పంచి, ఎంపిపి అధ్యక్షతన 'స్వచ్ఛత హి సేవ' ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఎంపిడిఒ అబ్దుల్‌నబి, ఈఓఆర్‌డి మమతాదేవి మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని మండల వ్యాప్తంగా విజయవంతంగా నిర్వహించామన్నారు. మా సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ అవార్డులకు ఎంపిక చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. అవార్డులు అందుకున్న వారిలో ఎంపిడిఒ, ఈఓఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు గొట్లూరు సచివాలయం నుంచి గణేష్‌రెడ్డి, మల్కాపురం-నిర్మల, సుబ్బారావుపేట-నారాయణరెడ్డి, ధర్మపురి-నాజ్మిన్, గొట్లూరు క్లాప్ మిత్ర లక్ష్మీనారాయణ ఉన్నారు. సుబ్బారావుపేట గ్రామానికి చెందిన కీలుగుర్రం కళాకారులను అవార్డులతో సత్కరించారు.

మడకశిర : స్థానిక వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాలలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారున. అలాగే స్వచ్ఛభారత్ దివస్ చేపట్టారు. కళాశాలలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు దత్తత గ్రామాల్లో స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ మంజుల, డాక్టర్ హరిబాబు, ప్రశాంతి, ఫిజికల్ డైరెక్టర్ రమేష్, కళాశాల సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు : మహాత్మగాంధీజీ జయంతి సందర్భంగా ఎంపిడిఒ శకుంతల స్వచ్ఛ భారత్ కార్మికులను సన్మానించారు. ఆమె మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులు రోజూ ఉదయమే చెత్త చెదారం తొలగిస్తూ గ్రామాలను శుభ్రంగా ఉంచడం ద్వారా ప్రజల ఆరోగ్యాలను కాపాడుతున్నారన్నారు. అలాంటి వారిని సన్మానించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సుందర, మేజర్ పంచాయతీ సర్పంచి పంచరత్నమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం : ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకొని స్వచ్ఛత పాటించాలని సర్పంచి నాగలక్ష్మిరాజు తెలిపారు. మహాత్మగాంధీ జయంతి పురస్కరించుకొని స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉపాధి హామీ కూలీలు ర్యాలీ నిర్వహించారు. సర్పంచి మాట్లాడుతూ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తద్వారా రోగాలు ప్రజల దరి చేరవని తెలిపారు. అనంతరం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటరాముడు, ప్రశాంత్‌కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ సునీల్, దేవిశెట్టి రామాంజి, సుధీర్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

పరిగి : స్థానిక సచివాలయ కేంద్రంలో బుధవారం దివ్య ఎడ్యుకేషన్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించి, దుస్తులు, స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా బిజెపి జిల్లా అధ్యక్షుడు జిఎం శేఖర్ హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే దేశ పురోగతి అని నమ్మిన వ్యక్తి గాంధీజీ అన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ముందుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచి లక్ష్మీదేవి, పంచాయతీ సెక్రటరీ అరుణ, కూటమి నాయకులు గోవిందరెడ్డి, సూర్యనారాయణ, బంగారు చంద్ర, భగత్‌సింగ్ సేవా సమితి సభ్యులు కార్తీక్, మంజు, జనసేన నాయకులు అశ్వర్థ, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం : స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో అధికారులు పంచాయతీ కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అలాగే డిఆర్‌డిఎ పిడి నరసయ్య, మండల ప్రత్యేక అధికారి, ఎంపిడిఒ రాబర్ట్ విల్సన్, ఈఓఆర్‌డి కేశవరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమేష్, బాబు, లక్ష్మీనారాయణ, జగదీష్, సురేష్, మంజు పాల్గొన్నారు.

ధర్మవరంలో అందుకున్న అవార్డులతో అధికారులు

మడకశిరలో పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కార్మికులకు వ్యాక్సిన్

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణంలోని ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శానిటేషన్, ఇతర విభాగాల్లో పని చేసే సిబ్బంది కోసం బుధవారం స్వచ్ఛత హి సేవలో భాగంగా ఆలయ అధికారి వెండిదండి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డిప్యూటీ జిల్లా వైద్యాధికారి డా. బి.నాగేంద్రనాయక్, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఎస్ఎండి.హుస్సేన్, వైద్య సిబ్బంది ఆలయ సిబ్బందికి టిటి వ్యాక్సినేషన్ వేశారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-చిలమత్తూరు

గాంధీ జయంతి సందర్భంగా బుధవారం టిడిపి ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. టిడిపి మండల కన్వీనర్ రంగారెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో మార్క్ ఆసుపత్రి వైద్యులు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ నాగరాజు, మహేష్, టిడిపి నాయకులు బి.నాగేంద్ర, అశ్వర్థప్ప, నందీశప్ప, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రొద్దం ఎంపిపి అనారోగ్యంతో మృతి

ప్రజాశక్తి-రొద్దం

రొద్దం ఎంపిపి చంద్రశేఖర్(60) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మండల కేంద్రమైన రొద్దంకు చెందిన వైసిపి ఎంపిపి ఏడాదిగా క్యాన్సర్‌తో బాధపడుతుండేవాడు. ఏడాది నుంచి చికిత్స చేయించుకుని రెండు నెలల నుంచి ఇంట్లో విశ్రాంతి తీసుకొంటున్నాడు. మూడు రోజుల క్రితం అనంతపురంలోని సవేరా ఆసుపత్రిలో చేరాడు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

5న మండల సమావేశం

గాండ్లపెంట : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈ నెల 5వ తేదీ ఇన్‌ఛార్జి వైస్ ఎంపిపి బి.గంగోజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ వెంకటరామిరెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ సమావేశంలో అన్ని శాఖలపై సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జడ్పిటిసి, ఎంపిటిసి సభ్యులు, మండల కో ఆప్షన్ సభ్యుడు, సర్పంచులు, అన్ని శాఖ అధికారులు హాజరుకావాలని ఆయన తెలిపారు.

వరద బాధితుల కోసం విరాళం

ప్రజాశక్తి-ముదిగుబ్బ

విజయవాడ వరద బాధితుల కోసం స్థానిక పివిఎస్ పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు కలిసి రూ. 12,500 నగదు సమీకరించి బుధవారం డిడి ద్వారా సిఎం సహాయ నిధికి జమ చేశారు. పివిఎస్ పాఠశాల ఛైర్మన్ పివి.నాయుడు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు బాధితులకు సాయం చేయడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. ఇటువంటి మానవీయ లక్షణాలను విద్యార్థులకు చిన్నతనం నుంచే అలవటుచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించండి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

మండలంలో దీర్ఘకాలంగా ఉన్న చుక్కల భూముల సమస్యలను పరిష్కరించాలని సిపిఐ నాయకుడు డిమాండ్ చేశారు. ఈ విషయమై ఈ నెల 4వ తేదీ సిఎం చంద్రబాబు, డిప్యూటీ సింఎ పవన్‌కళ్యాణ్, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కలిసి వివరించేందుకు సిపిఐ ఆధ్వర్యం లో చేపట్టిన 'చలో అమరావతి' కార్యక్రమంలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ముదిగుబ్బ పట్టణంతో పాటు మండల వ్యాప్తంగా భూములు, ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ కాక ఇబ్బంది పడుతున్న వారంతా శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ముదిగుబ్బ రైల్వే స్టేషన్ చేరుకోవాలన్నారు. సొంత ఖర్చులతో హాజరు కావాలని సూచించారు.

కరాటే పోటీల్లో 'బ్లూ మూన్' విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి-కదిరి టౌన్

రాష్ట్ర స్థాయి 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాజంపేటలో నిర్వహించిన పోటీల్లో పట్టణంలోని 'బ్లూమూన్' విద్యాసంస్థల విద్యార్థులు పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచినారు. అండర్-19 విభాగంలో సిరి, ఎం.నిఖిత, ఎం.రాహుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మంచి శివ శంకర్ మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మనోహర్‌రెడ్డి, బ్లూ మూన్ స్కూల్ హెచ్ఎం సురేందర్‌రెడ్డి, మాధవరెడ్డి, పిఈటి రామాంజనేయరెడ్డి పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ చాటిన బ్లూ మూన్ పాఠశాల విదార్థినులు